నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

బుధవారం | 12 నవంబరు 2025

పేజీలు 8


- కర్నూలు విమానాశ్రయంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

## పరిశ్రమల ఏర్పాటుతో

# ఉపాధి కల్పనకు ప్రత్యేక కృషి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పించేందుకు సిఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా 50ఎంఎస్‌ఎంఈ పార్కులకు కనిగిరి నుంచి ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

మిగతా 2లో



శిలాఫలకాన్ని ప్రారంభించిన మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపి నాగరాజు

## మహనీయుల ఆచరణ

# విద్యార్థులకు స్ఫూర్తి కావాలి

- ఉర్దూ యూనివర్సిటీకి రూ. కోటి విరాళం ప్రకటించిన భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ.భరత్

**కర్నూలు, మేజర్ న్యూస్ :** మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకం అని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ మరియు వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు.మంగళవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో

మిగతా 2లో



సమావేశంలో పాల్గొన్న అధికారులు

# ఏసీబీ వలలో డిప్యూటీ తహశీల్దార్

- రూ.35వేలు నగదు తీసుకుంటూ పట్టుబడ్డ డిటి
- చుక్కల భూమి క్రమబద్ధీకరణ కొరకు లంచం డిమాండ్
- అవినీతి, ఆరోపణలకు కేంద్రంగా డోన్ తహశీల్దార్ కార్యాలయం

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్‌:** డోన్ తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ అధికారుల దాడులు కలకం రేపాయి.

మిగతా 2లో



ఏసీబీ అధికారులకు పట్టుబడిన డిటి సునీల్‌రాజ్

# రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే పరిశ్రమల ఏర్పాటు

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ.భరత్

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల వల్లే రాష్ట్రంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఏర్పాటు చేస్తున్న రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్ లిమిటెడ్‌ను రాష్ట్ర

మిగతా 5లో



శిలాఫలకాన్ని ప్రారంభించిన మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత

## భక్తులకు మెరుగైన వసతులు కల్పించటమే

# ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి
- శ్రీశైలంలో 4 స్టార్ హొటల్ భవన నిర్మాణానికి భూమిపూజ
- 83 కోట్ల వ్యయంతో 126 రూములు కలిగిన ఆధునిక 4 స్టార్ హొటల్ నిర్మాణం




కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బిసి,కలెక్టర్ రాజకుమారి,ఎమ్మెల్యే బుడ్డా


MONTESSORI

GOLDEN JUBILEE INAUGURAL CEREMONY

50 YEARS OF ACADEMIC EXCELLENCE

WELCOME



Chief Guest
His Excellency
Sri S Abdul Nazeer garu
Hon'ble Governor of Andhra Pradesh

Special Guests of Honour
Sri T G Bharath garu
Hon'ble Minister for Industries, Commerce & Food Processing Govt. of Andhra Pradesh

Sri B Nagaraju garu
Hon'ble MP, Kurnool

Dr B. Shabari garu
Hon'ble MP, Nandyal

Smt Gowru Charitha Reddy garu
MLA, Panyam

Dr P V Parthasarathi garu
MLA, Adoni

Sri B. Dastagiri garu
MLA Kodumur

Sri Githa Jayasurya garu
MLA, Nandikotkur

Sri B Jaya Nageswara Reddy garu
MLA, Yemmiganur

Sri S ABDUL NAZEER garu
Hon'ble Governor of Andhra Pradesh

12TH NOVEMBER 2025 | AT 02:30 PM
A-CAMP, KURNOOL

MONTESSORI E.M. HIGH SCHOOL · MONTESSORI RESIDENTIAL SCHOOL · MONTESSORI SENIOR SECONDARY SCHOOL · MONTESSORI INDUS RESIDENTIAL SCHOOL · SPROUTZ SCHOOL · MONTESSORI INVICTUS SCHOOL · MINDS INFINITE · MONTÉ SCHOOL · MONTESSORI ELITE SCHOOL · MONTESSORI OLYMPUS SCHOOL

Be in the premises before 01:30PM with ENTRY PASS

సూర్య www.suryaa.com

బుధవారం | 12 నవంబరు 2025

# ఏసీబీ వలలో డిప్యూటీ తహశీల్దార్

(మొదటి పేజీ తరువాయి)



డోన్ తహశీల్దార్ కార్యాలయం

రూ.35వేల లంచం తీసుకుంటూ డోన్ మండల రీ సర్వే డిప్యూటి తహశిల్దార్ సునీల్ రాజ్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం వెల్దుర్తి మండలం గుంటుపల్లె గ్రామానికి చెందిన దామా వేణుగోపాల్‌చౌదరి అనే రైతు డోన్ మండలం జగదూర్తి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 20–1, 20–బి2, 27–బి2లలో తమకు గల పది ఎకరాల చుక్కల భూమి క్రమబద్ధీకరణ కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే డోన్ మండల రీ సర్వే డిప్యూటి తహశిల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సునీల్‌రాజ్ సదరు రైతును రూ.60వేలు లంచం డిమాండ్ చేశారు. రైతు అంత మొత్తం ఇచ్చుకోలేనని రూ.35వేలకు ఒప్పందం కుదుర్చుకు న్నారు. లంచం ఇవ్వడం ఇష్టంలేని రైతు వేణుగోపాల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో మంగళవారం డోన్ తహశిల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు డిటి సునీల్‌రాజు రూ.35వేలు నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సిఐలు కృష్ణయ్య, రాజాప్రభాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



బాధిత రైతు దామా వేణుగోపాల్‌చౌదరి

ఇటీవలి కాలంలో పలు వివాదాలకు డోన్ తహశిల్దార్ కార్యాలయం కేంద్రంగా నిలుస్తుంది. పలువురు విఆర్ఓలపై కూడా పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చూద్దాం మరి ఇప్పటికైనా రెవెన్యూ అధికారుల తీరు ఏమైనా మారుతుందో లేదో..

## భక్తులకు మెరుగైన వసతులు కల్పించటమే ప్రభుత్వ లక్ష్యం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** భక్తులకు మెరుగైన వసతులు కల్పించటమే ప్రభుత్వా లక్ష్యం అని రాష్ట్ర రోడ్లు భవనాలు మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు.శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో రూ.83 కోట్ల వ్యయంతో 126 రూములు కలిగిన ఆధునిక 4 స్టార్ హోటల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి అన్నారు. మంగళవారం శ్రీశైలం,ప్రకాశం జిల్లా కనిగిరిలోని పెదఈర్లపాడు నుండి రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా 4 స్టార్ హోటల్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో పాటు ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు,నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి,శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజ శేఖర రెడ్డి,దేవస్థానం చైర్మన్ పి.రమేష్ నాయుడు,ఈవో ఎం.శ్రీనివాసరావు,శ్రీవెంకటేశ్వర గ్రూప్స్ వ్యవస్థాపకులు రామస్వామి వెంకటరమణ, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ శ్రీశైలంలో భక్తుల అవసరాలకు అనుగుణంగా స్టార్ హోటల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు.ఇందులో భాగంగానే రూ.83 కోట్ల వ్యయంతో 126 రూములు కలిగిన ఆధునిక 4 స్టార్ హోటల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు.నంద్యాల జిల్లా శ్రీశైలంలో శ్రీ వెంకటేశ్వర గ్రూప్స్ ఆధ్వర్యంలో నిర్మించబోయే 4 స్టార్ హోటల్ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగిందన్నారు.దాదాపు 1.5 ఎకరాల స్థలాన్ని 33 సంవత్సరాల లీజుకు శ్రీ వెంకటేశ్వర గ్రూప్‌కు కేటాయిస్తున్నామన్నారు.హోటల్ నిర్మాణానికి ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం లీజుకు స్థలం కేటాయించి అభివృద్ధిలో భాగస్వాములుగా చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వర గ్రూప్ శ్రీశైలంలో హోటల్ నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమని మంత్రి అన్నారు.18 నెలల కాల పరిమితిలో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని సూచించారు.ఈ హోటల్ నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం కేవలం వ్యాపార దృక్పథంలో చూడడం లేదని స్థానిక యువతకు ఉపాధి,పర్యాటక రంగానికి ఉత్సాహం,శ్రీశైలం అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ.. శ్రీశైలం కేవలం ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మాత్రమే కాదు, పర్యాటక అభివృద్ధికి కేంద్రబిందువుగా మారే సామర్థ్యం కలిగిన ప్రాంతమన్నారు.4 స్టార్ హోటల్ భవన నిర్మాణం పూర్తయితే భక్తులు పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు.ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 300 మందికి ప్రత్యక్షంగా,1,200 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనుందన్నారు.

# ఓటరు మ్యాపింగ్ తప్పనిసరి

**మండల తహశీల్దార్ వెంకటలక్ష్మి**



**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** ఓటరు జాబితాలో ఓటరు వివరాలను పరిశీలించి తప్పులను గుర్తించి, తప్పులు లేని ఓటరుకు మ్యాపింగ్ చేయాలని మండల తహశీల్దార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్ నందు బిఎల్‌ఓలకు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 2002ఓటరు జాబితాలో టీఆర్కే వివరాలు 2025 ఓటరు జాబితా వివరాలు సరిచూసుకుని ఓటరు మ్యాపింగ్ తప్పనిసరి చేయాలని సూచించారు. ఓటరు జాబితా వివరాలు సరిగా లేని ఓటరును మ్యాపింగ్ చేయరాదని సూచించారు.పైన పేర్కొన్న ఓటరు మ్యాపింగ్ త్వరగతిన పూర్తి చేయాలని మండల తహశీల్దార్ వెంకటలక్ష్మి సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ ఆదినారాయణ,బిఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల ఆచరణ విద్యార్థులకు స్ఫూర్తి కావాలి

(మొదటి పేజీ తరువాయి)

డా.మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జరిగిన మైనారిటీ సంక్షేమ దినోత్సవం మరియు జాతీయ విద్యా దినోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డా.అబుల్‌కలాంఆజాద్ లాంటి మహనీయుల జీవితాలు, వారి ఆచరణ విద్యార్థులకు ప్రేరణ కావాలన్నారు. భారత జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప విద్యావేత్త అని, ఆయన చదువుల ద్వారానే సైన్స్, టెక్నాలజీ ప్రాముఖ్యతను దేశానికి తెలియజేశారని తెలిపారు.స్వాతంత్ర సమరయోధుడు, దేశంలో మొదటి విద్యాశాఖ మంత్రి సైన్స్ మౌలానా అబుల్ కలాం ఆజాద్, భారత దేశ విద్యా వ్యవస్థకు పునాదులు వేశారని, యుజిసి, ఐఐటీ, ఐఐఎంల స్థాపనలో కీలకపాత్ర పోషించారని ఈసందర్భంగా గుర్తు చేశారు. టీచర్లు విద్యార్థులకునాయకుల త్యాగాలు, కృషి, ఆలోచనలను బోధించడం ద్వారా వారికి కొత్తవిషయాలపై అవగాహన కలుగుతుందని, యువత నాయకుల అడుగుజాడల్లో నడిచే విధంగా మార్గనిర్దేశం చేయాలని సూచించారు.ఈరోజు మనంఈస్థాయిలో ఉన్నామంటే ఇలాంటి పెద్దలు వేసిన బాటే కారణం అని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులపై మాట్లాడుతూ ఇప్పటి ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారాయని, విద్యా వ్యవస్థను విద్యాశాఖ మంత్రి పటిష్టం చేస్తున్నారని తెలిపారు. కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీ స్థాపన కోసం గత తెలుగుదేశం ప్రభుత్వ హయంలో రూ.10 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయ ని, అయితే గత ప్రభుత్వ హయాంలో పనులు ఏమి జరగలేదని తెలిపారు ప్రస్తుతం ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధి కోసం పూర్తిగా కృషి చేస్తామని మంత్రి తెలిపారు తాను తన మిత్రుల సహకారంతో కోటి రూపాయలు అందిస్తానని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు కర్నూలు నగరం రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని పదివేల కోట్ల తో ప్రాజెక్టులు సంబంధించిన పనులు మొదలయ్యాయని మంత్రి తెలిపారు. అందువల్ల ఇక్కడే ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థులు బాగా చదువుకావాలని మంత్రి సూచించారు.జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.. కర్నూలు జిల్లాలో సుమారు 3.25 లక్షల మంది మైనారిటీలు నివసిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మైనార్టీల విద్య, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు.పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ ద్వారా 4,473 మంది విద్యార్థులకురూ.85 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మైనారిటీల ఆధ్యాత్మిక మరియు మౌలిక వసతుల అభివృద్ధి కొరకు 4 మసీదులకు రూ. 1.13 కోట్లు, 4 చర్చలకు రూ. 1.37 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు.అలాగే ఇమాంలకు నెలకు రూ. 10 వేల చొప్పున, మౌజంలకు రూ. 5 వేల చొప్పున 353 మందికి రూ. 3.15 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. పాస్టర్స్‌కు కూడా 126 మందికి ప్రతి నెల రూ. 5 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. ప్రధానమంత్రి జనవికాస్ కార్యక్రమం ద్వారా మైనారి టీల కోసం పలు అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయని, వాటిలో ఐటీఐ కాలేజ్, ప్రీ–మెట్రిక్ బాలికల వసతిగృహం, పోస్ట్ మెట్రిక్ బాలుర వసతిగృహం (ఆదోని), రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, జూనియర్ కాలేజ్ నిర్మాణాలు పూర్తి అయినట్లు పేర్కొన్నా రు.ఉర్దూ డిగ్రీ కాలేజ్, పోస్ట్ మెట్రిక్ గర్ల్స్ హాస్టల్, ప్రీ మెట్రిక్ హాస్టల్ నిర్మాణాల కోసం స్థల సేకరణ జరుగుతోందని, త్వరలో టెండర్లు పూర్తవుతాయని తెలిపారు.జిల్లాలో అక్షరాస్యత శాతం ప్రస్తుతం 56% మాత్రమే ఉందని పేర్కొంటూ, తల్లిదండ్రులు తమ పిల్లలను విద్యాబుద్ధులతో ముందుకు నడిపించాలని, ఎన్ని కష్టాలు వచ్చినా చదువు ఆపకూడదని సూచించారు. ప్రభుత్వం తరఫున స్కాలర్షిప్స్, తల్లికి వందనం, వసతిగృహాలు, మిడ్ డే మీల్స్ వంటి సదుపాయాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈరోజు ప్రభుత్వం ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో ఆరు పరిశ్రమలు, మూడుఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. జిల్లాలో భారీ పెట్టుబడులు వస్తున్నాయని, వాటిలో రిలయన్స్ ఒకటని తెలిపారు.రాబోయే నాలుగు నుంచి ఐదు సంవత్సరాలలో కర్నూలు జిల్లా అన్ని రంగాల్లో విస్తృతంగా అభివృద్ధి సాధిస్తుందని, భవిష్యత్తులో స్థానిక యువతకు జిల్లా లోపలే ఉద్యోగావకాశాలు లభిస్తాయని, పిల్లల్ని బాగా చదివించాలని కలెక్టర్‌పేర్కొన్నారు.జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, తొలి విద్యా శాఖా మంత్రిగా విద్యా వ్యవస్థకు బలమైన పునాది వేశారని కొనియాడారు.

# పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి కల్పనకు ప్రత్యేక కృషి

(మొదటి పేజీ తరువాయి)




జ్యోతిని వెలిగిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు




వర్చువల్‌గా మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ఇందులో భాగంగా కర్నూలు ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేస్తున్న ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌ను ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కర్నూలు ఎయిర్ పోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపి బస్తిపాటి నాగరాజు, ఏపి ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం, పాలసీలను అమలు చేయడం వల్ల పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని తెలిపారు. కర్నూలు ఎయిర్‌పోర్ట్‌లో మెల్ స్టార్ ఏవియేషన్స్ టెక్ ప్రై.లి సంస్థ ఆద్వర్యంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఏపి ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు కానున్న ఈ సంస్థ ద్వారా వాణిజ్య, ప్రైవేట్ పైలట్‌లకు శిక్షణ ఇచ్చే ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ డిజిసిఏ ఆమోదిత కోర్సులు, కమర్షియల్ పైలట్ లైసెన్స్ ప్రైవేట్ లైసెన్స్, ప్రైవేట్ పైలట్ లైసెన్స్, మల్టీ ఇంజన్ రేటింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనుందన్నారు. మొదటి దశలో రెండు ఎకరాల్లో రూ.100కోట్లతో ఈ సంస్థ ఏర్పాటవుతోందన్నారు. దీంతో రాష్ట్రం పైలట్ శిక్షణలో ప్రముఖ కేంద్రంగా తయారు కానుందని మంత్రి తెలిపారు. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా మొదటి దశలో వంద మందికి, పరోక్షంగా 250మందికి ఉపాధి లభించనుందన్నారు. వచ్చే ఏడాది జూలై నాటికి నిర్మాణాలు పూర్తి చేసి వంద మందికి శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.ఎంపి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి శరవేగంగా సాగుతోందన్నారు. ఓర్వకల్లు పారిశ్రామిక హక్కు ద్వారా అనేక పరిశ్రమలు, డ్రోన్ సిటీ లాంటి ప్రాజెక్టులు రావడం వల్ల యువతకు విరివిగా ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందని ఎంపి తెలిపారు. కార్యక్రమంలో మెల్ స్టార్ ఏవియేషన్స్ టెక్ ప్రై.లి సంస్థ డైరెక్టర్ కశ్యప్, సెట్కూరు సీఈఓ డా. వేణుగోపాల్, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, డిఐఓ ప్రవీణ్ రెడ్డి, డిఈ అమృత్ పాల్గొన్నారు.

# స్టాంటన్‌పురంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

**డోన్, మేజర్‌న్యూస్:** నగరంలోని కెవిఆర్ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల కర్నూలు వారి ఆధ్వర్యంలో స్టాంటన్‌పురంలో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం మంగళవారం రెండవ రోజు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడొద్దు....డ్రగ్స్ వాడొద్దు బ్రో, క్లీన్ అండ్ గ్రీన్ వంటి నినాదాలతో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ అనంతరం స్టాంటన్‌పురం వాటర్ ట్యాంక్ పరిసరాలను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రధాత అతిధిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ అండ్ క్లస్టర్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ.జయలక్ష్మి, కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ గౌరవ అతిధిగా నికిత పాల్గొన్నారు. ఇద్దరు అతిధులు విద్యార్థులకు విద్య ప్రాముఖ్యత, క్రమశిక్షణ, సేవాస్ఫూర్తి గురించి ప్రేరణాత్మక ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణీ ఎస్.రేష్మా పర్యవేక్షణలో వాలంటీర్లు చురుగ్గా నిర్వహించారు.



# ఏరియా వైద్యశాలలో హృద్రోగులకు ఉపశమనం

**★ఫిజీషన్ వైద్యుల రాకతో గుండెజబ్బులకు పరిష్కారం**
**★ఒక సూదిమందుతో ప్రణాలకు రక్షణ**
**★మెరుగైన సేవలు అందిస్తాం .. సూపరిండెంట్ డాక్టర్ ఆదినాగేష్**

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి :** ఎమ్మిగనూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాల లో గుండెజబ్బులకు ఉపశమనం లభిస్తుంది..వైద్యశాలకు నూతనంగా ఫిజీషన్ రాకతో హృద్రోగుల సమస్యకు పరిష్కారం అందివచ్చింది. ఎమ్మిగనూరు ప్రాంతంలో చాతిలో నొప్పి వచ్చిన వెంటనే 3 గంటలలోపు ప్రభుత్వ ఏరియా వైద్యవాలకు చేరుకున్న రోజులకు అక్కడి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఆదినాగేష్ ద్వారా టెనెక్ట్ లెక్స్ అనే సూదిమందుతో ప్రణాలకు రక్షణ కల్పిస్తున్నారు. ఆయన వచ్చి విధులు చేరిన రెండు మూడు రోజుల్లోనే హృద్రోగులకు


హృద్రోగికి సూదిమందు అందిస్తున్న వైద్యులు ఆదినాగేష్

నలుగురికి ఇలాంటి వైద్యసేవలు అందించి ప్రణాలు కాపాడారు. ఫిజీషియన్‌గా పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో విధులు చేపడున్న సమయంలో గుండె జబ్బుతో బాదపడుతూ వస్తున్న వారికి ఇలాంటి సూదిమందుతోనే దాదాపు 50 మందికి అందించి ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని మిలటరీ కాలనీకి చెందిన 45 ఏళ్ల రమేష్ అనే వ్యక్తికి ఏరియా వైద్యశాలలో టెనెక్ట్‌లెక్స్ అనే సూదిమందు అందించి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు క్యాతలాబ్‌కు పంపడం జరిగింది. అయితే వైద్యుడు ఆదినాగయ్య తెలుపుతున్న సూచనలు, సలహాల మేరకు చాతిలో నొప్పి వచ్చిన 3 గంటల వ్యవదిలో టెనెక్ట్‌లెక్స్ సూదిమందు అందించడం జరుగుతుందన్నారు. 45 వేల రూపాయల విలువ చేసే ఈ సూదిమందు ప్రభుత్వం ఉచితంగా అందించడం జరుగుతుంది కావున గుండె జబ్బులు వచ్చిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సూదిమందును హృద్రోగులు తీసుకుని ప్రాణాలు కాపాడుకోవాలని తెలిపారు. ఎమ్మిగనూరు ఏరియా వైద్యశాల సూపరిండెంట్‌గా ఇక్కడ రోగులకు మెరుగైన సేవలు అందించడం జరుగుతుందన్నారు.

# ఆళ్లగడ్డలో ఇండస్ట్రియల్ పార్కు ప్రారంభం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** మండలంలోని ఆర్ .కృష్ణాపురం గ్రామంలో ఇండస్ట్రియల్ (ఎంఎస్‌ఎంఈ) పార్కు ను మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. మండలంలోని ఆర్ కృష్ణాపురం గ్రామంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు కోసం 44 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ డిప్యూటీ జోనల్ మేనేజర్ స్రవంతి, ఎస్ఎం భాష మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు కోసం ఎవరైనా ముందుకు వస్తే వారికి స్థలాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆళ్లగడ్డ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ హరి గోపాల్ , మండల తాసిల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి చంద్రశేఖర్ మరియు మండల టిడిపి కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి,ఆర్.కృష్ణాపురం నాయకులు రఘురామిరెడ్డి, వెంకట శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వసతి గృహాలను పరిశీలించిన అధికారులు:** మండలంలోని కోట కందుకూరు గ్రామంలో ఉన్న మోడల్ హైస్కూల్ ను అధికారు



లు తనిఖీ చేశారు. మండల ప్రత్యేక అధికారి హరి గోపాల్, ఎంపీడీవో నూర్జహాన్, ఎంఆర్ఓ జ్యోతి రత్నకుమారి తదితరులు తనిఖీ చేశారు. ఆళ్లగడ్డ పట్టణంలో ని బీసీ హాస్టల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులస్నానగదులు, మరుగుదొడ్లు సహా ఇతర వసతి సౌకర్యాలను పరిశీలించారు.

# ఘనంగా బంగారమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠాపన

**– అవ్వ సన్నిధిలో గుడిసె కృష్ణమ్మ**

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని మండల పరిధిలోని గణేకల్ గ్రామంలో బంగారమ్మ దేవాలయ పునః నిర్మాణం చేపట్టారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు మంగళవారం శ్రీ బంగారమ్మవ్వ విగ్రహ ప్రతిష్ఠాపనకు ముఖ్యఅతిథిగా టీడీపీ మాజీ ఇంచార్జీ గుడిసె కృష్ణమ్మ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆదోని


గుడిసె కృష్ణమ్మను సన్మానిస్తున్న గ్రామస్థులు

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. దశాబ్దాలుగా గణేకల్ గ్రామంలో బంగారమ్మవ్వవ్వ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అనంతరం ఆలయ పెద్దలు గుడిసె కృష్ణమ్మకు పూలమాలలు వేసి శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కపటి మాధవ్, మల్లయ్య, బంగారు బాబు, బెస్త ఓంకార్ మాజీ ఎంపిపి మురళీ, కల్లుబావి మల్లికార్జున, సాదిక్ వలి, లక్ష్మీ నారాయణ, రాఘవరెడ్డి, ముని, వెంకటేష్, హనుమంతు, రామాంజి, బసవరాజ్, హుసేనప్ప, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం




**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** మంగళవారం భారత దేశ ప్రథమ విద్యామంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం పురస్కరించుకుని నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ పీవీ సుధాకర్ రెడ్డి, జోన్ చైర్మన్ నిజాముద్దీన్ లు పాల్గొని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ల జోన్ చైర్మన్ నిజాముద్దీన్ సౌజన్యంతో ఇద్దరు పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందజేశారు. విద్యార్థుల తరఫున వారి తండ్రులు నగదు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ ప్రథమ విద్యామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్యం తర్వాత దేశంలో విద్యా వ్యాప్తికి విశేష కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్, రీజియన్ చైర్మన్ పీవీ సుధాకర్ రెడ్డి, జోన్ చైర్మన్ నిజాముద్దీన్, విద్యార్థుల తండ్రులు మధు, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# ఈ నెల సదరం ధృవీకరణ పత్రాలకు స్లాట్ బుకింగ్

**అవుకుమేజర్,న్యూస్ః** రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులకు వైకల్య నిర్ధారణకు ఈ నెల 14వ తేదీ నుండి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రదర్ ఐ.ఎ.ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు, డిసెంబరు 2025 రెండు నెలలకుగాను సదరం స్లాట్ బుకింగ్ నిమిత్తం తమ దగ్గరలోని గ్రామ వార్డు సచివాలయంలో సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రులలో మంగళవారం శారీరక మానసిక బధిరుల, దృష్టి వైకల్యం ఉన్న వారికి ఏరియా హాస్పిటల్‌లో శారీరక దృష్టి వైకల్యం కలిగిన వారికి సి.హెచ్.సిలో సోమవారం శారీరక దృష్టి వైకల్యం ఉన్న వారికి సదరం ధృవీకరణ పత్రాలు జారీ చేసేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని సెకండరీ హెల్త్ డైరెక్టర్ చక్రదర్ ఐఏఎస్ తెలియజేశారు.

# అబుల్ కలాం సేవలు ఆదర్శనీయం

**ఎమ్మిగనూరు టౌన్,మేజర్‌న్యూస్:** దేశానికి మౌలానాఅబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు ఆదర్శనీయమని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని స్థానిక జడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటప్ప, ఉపాధ్యాయులు అబ్దుల్ నజీర్, నిసార్ ఆహమ్మద్‌లు పేర్కొన్నారు. మంగళవారం అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రప


పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

టానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుడిగా, దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశిష్ట సేవలు అందించారని తెలిపారు. నేటి విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోహిణి, చాంద్ బాషా, కలాం, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# 30 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని వినతి


ట్రైనీ ఐఏఎస్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

**హొళగుంద,మేజర్‌న్యూస్ః** స్థానికంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేయాలని ట్రైనీ ఐఏఎస్ అధికారులకు టీడీపీ ముస్లీం మైనార్టీ నాయకులు మంగళవారం వినతి పత్రం ఇచ్చి ఆస్ఫత్రి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. నాయకులు అబ్దుల్ సుభాన్,సిబిఎన్ ఆర్మీ మోయిన్,వలిబాషా,తాహేర్ ట్రైనీ ఐఏఎస్ అధికారులను కలిసి ఆస్పత్రి సమస్యలను వారికి వివరించారు.మారుమూల హొళగుంద మండలం కేంద్రంలోని ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు లేవని,గర్భిణీ స్త్రీలు వైద్యాం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని చెప్పారు.ఈ ఆస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా అఫ్ గ్రేడ్ చేస్తే మండల ప్రజలకు మెరుగైన వైద్యా సదుపాయం అందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.కావున ఈ ప్రధాన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆస్పత్రి ఏర్పాటు చేసేలా కృషి చేయాలని వారిని కోరారు.అయితే ట్రైనీ ఐఏఎస్ అధికారులు రెండు రోజులుగా మండలంలోని పర్యటించారు.ప్రభుత్వ కార్యాలయాలను,పాఠశాలలను, ఎల్లార్తి దర్గాలను,దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించి వివిధ సమస్యలను మండల అధికారులను,ప్రజల ద్వార అడిగి తెలుసుకున్నారు.

## జీవిఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం

**డోన్, మేజర్‌న్యూస్ః** పట్టణ సమీపంలోని జీవిఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం తో పాటు కార్తీక వనసమారాధన కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భారతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ మౌలా


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ అధికారి

నా అబ్దుల్‌కలాం ఆజాద్ మొట్టమొదటి కేంద్ర విద్యాశాఖమంత్రి గా నెలకొల్పిన సంస్థలను, విద్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేశామన్నారు. వనాల ప్రాముఖ్యత, వనాల సంరక్షణకు పాటించాల్సిన పద్ధతులను ఆమె విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యే కోట్ల సమగ్ర పరిశీలన


అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

**డోన్, మేజర్‌న్యూస్ః** పట్టణంలోని పాతపేట పూలమార్కెట్, బేతంచెర్ల సర్కిల్, దొరపల్లె బ్రిడ్జి, మాలిక్‌బాబా వెళ్ళే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు, రైల్వే గేట్ల వద్ద రద్దీ, రహదారి మరమ్మతులు, మౌలిక సదుపాయాలపై డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి మంగళవారం సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల సంబందిత అధికారులతో సమావేశమై ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సౌకర్యం కోసం రహదారి విస్తరణ, డ్రైనేజి సదుపాయాల అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సంబందిత అధికారులకు ఆదేశించారు.

## సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి మంగళవారం తనిఖీ చేశారు. జైల్లో ఖైదీలు ఎన్ని రోజులుగా శిక్ష అనుభవిస్తున్నారు.. లాయర్లను ఏర్పాటు చేసుకున్నారా లేదా అనే విషయాలుఅడిగి తెలుసుకున్నారు. జైల్లో అం దిస్తున్న సేవలు,



సౌకర్యాలు,భోజన వసతి గురించి అడిగి తెలు సుకున్నారు. న్యాయవాదిని నియమించుకోలేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి భాస్కర్, ప్యానల్ న్యాయవాదులు షాహినా బేగం, మోహన్ డాక్టర్ లిఖిత్ రెడ్డి, సబ్ జైలు సూపరిండెంట్ సెల్వంత్ మరియు జైలు సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య



# విద్యాభివృద్ధికి మౌలానా సేవలు చిరస్మరణీయం

**:- కమీషనర్ పి విశ్వనాథ్**



మాట్లాడుతున్న కమీషనర్ విశ్వనాథ్

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** భారతదేశపు తొలి విద్యా శాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి చిరస్మరణీయ సేవలు అందించారని నగరపాలక సంస్థ కమీషనర్ పి విశ్వనాథ్ కొనియాడారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఆజాద్ జన్మదినం పురస్కరించుకుని మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆయన స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి, మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆర్‌జివి క్రిష్ణ, డిప్యూటీ కమీషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి డా. నాగశివ ప్రసాద్, డిసిపి వెంకట రమణ, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, సూపరింటెండెంట్ రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎగువ అహోబిలం క్షేత్రం హుండీ ఆదాయంగా రూ.69.90 లక్షలు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అహోబిల మఠం సీఈవోసుందర రాజన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. ఎగువ అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ చెంచులక్ష్మి అమ్మవారి ఆలయాలలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా రూ.69.90 రాబడి లభించినట్లు మఠం అధికారులు తెలిపారు. రేపు దిగువ అహోబిలం క్షేత్రంలో కూడాహుండీ లెక్కింపు ఉంటుందని మఠం అధికారులు తెలిపారు.

## అంగరంగ వైభవంగా మల్లాలమ్మ దేవి దేవర ఉత్సవాలు

**- అమ్మవారికి ప్రత్యేక పూజలు**





**ఆదోని రూరల్, మేజర్ న్యూస్:** పట్టణంలోని విక్టోరియాపేటలో వెలసిన మాత మల్లేశ్వరమ్మ (మల్లాలమ్మ) దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం 3వ మంగళవారం పురస్కరించుకొని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేదరి కులసంఘం ఆధ్వర్యంలో మహిళలు కలశాలు, డప్ వాయిద్యాలతో కుంబోత్సవంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ ఈరయ్య, వెంకోబ, మదిరె ఈరన్న, ఈరయ్య, రఘు, తిమ్మయ్య, నల్లారెడ్డి, బుడ్డేకల్లు తిమ్మప్ప, మధు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



మౌళానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూమాలలు వేస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం మౌళానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లలిత విద్యార్థులు అధ్యాపకులనుద్దేశించి ప్రసంగించారు. మౌళానా అబ్దుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ నాయకులలో ఒకరని స్వాతంత్ర్యం అనంతరం భారత దేశానికి తొలి విద్యా మంత్రిగా సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన పేరున ఐఐటిలు, ఐ.ఐ.ఎస్.ఈ, యూజిసి సంగీత నాటక అకాడమి వంటి ప్రతిష్టాత్మక సంస్థలు స్థాపించబడ్డాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. బడే సాహేబ్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎండిపోయిన మినుపంట

## పురుగుల మందుల పిచికారి

**మూడు లక్షల నష్టం ఆదుకోవాలని రైతు ఆందోళన**

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** ఆరుగాలం కష్టించి వేసిన పైరు చేతికొచ్చే సమయంలో చాగలమర్రి లోని ఓ పురుగుల మందు వ్యాపారిచ్చిన మందులు పిచ్చుకారి చేయడంతో పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోయి నష్టపోయిన వైనం మండలంలోని కొలముల పేట గ్రామంలో చోటుచేసుకుంది. కొలముల్ పేట గ్రామానికి చెందిన ఎర్రం శివారెడ్డి అనే రైతు సాగుచేసిన నాలుగు ఎకరాల మినుము పంటకు చాగలమర్రి లోని ఓ షాపులో కొనుగోలు చేసిన మందులను పిచికారి చేయడం జరిగిందని పిచికారి చేసిన మరుసటి రోజు నుండి చేతికొచ్చే మినిమం పంట ఎండిపోవడం జరిగిందని రైతు ఎర్రం శివారెడ్డి వాపోయారు. తాను కౌలుకు తీసుకున్న రెండు ఎకరాలు, తన కొడుకులకు సంబంధించిన రెండున్నర ఎకరా పొలం లొ కోటాద్రి అనే మినుము రకం వేయడం జరిగిందని పంట వేసి రెండు నెలలు పూర్తయిందని, పొలంలో తెగులు సంభవించడంతో ఆ షాపులో ఫర్టిలైజర్ దుకాణంలో నాలుగు రోజుల కిందట ఇచ్చినా పురుగులు మందులను పిచికారి చేయడం జరిగిందన్నారు. ఈ నెలలో కొత జరుగుతుందని పంటను కోసి దిగుడుతో పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చుదామని ఆశతో ఉంటే పురుగుల మందు పిచికారి చేయడం వల్ల పూర్తిగా ఎండిపోయిందని మహిళా రైతు ఎర్రం రామలక్ష్మ వాపోయారు. స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.. గిత్త

**- వ్యవసాయ శాఖ మంత్రి కలిసిన ఎమ్మెల్యే**

**- రైతులను ఆదుకోవాలని మంత్రికి వినతి**

**పగిడ్యాల మేజర్ న్యూస్ :** నియోజవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న పంటను సాగు చేసినరైతులనుఆదుకునేందుకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడును స్థానిక ఎమ్మెల్యే గిత్త జయసూర్య, నంద్యాల తెదేపా పార్లమెంట్ ఇంచార్జి మాండ్ర శివానందరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వేలం ప్రసాద్‌రెడ్డిలు కోరారు. మంగళవారం కర్నూలు జిల్లాకు విచ్చేసిన సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడుని ఎమ్మెల్యే గిత్త జయసూర్య నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాద రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి నందికొట్కూరు నియోజవర్గంలో రైతులు ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించి దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని



వారు మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి మాట్లాడుతూ త్వరలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# టీడీపీ బలోపేతమే మనందరి లక్ష్యం..

**-ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి**

**-ఘనంగా తెలుగుదేశం పార్టీ ఇంఛార్జ్‌ల ప్రమాణస్వీకారోత్సవం**

**డోన్, మేజర్‌న్యూస్:** డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి రెట్టించిను ఉత్సాహంతో ప్రతి టిడిపి నాయకుడు, కార్యకర్త ముందుకు నడవాలని, అభివృద్దే మనందరి లక్ష్యమని డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. మంగళశారం పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు డోన్ నియోజకవర్గ మండల, పట్టణ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జీల ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. అంతకుముందు తెలుగుదేశం పార్టీ జెండాను ఎమ్మెల్యే కోట్ల ఎగురవేసి, నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాల వేసి, నిన్న ఢిల్లిలో జరిగిన బాంబు పేలుళ్ళలో మరణించిన వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల,

గా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి నూతన ఇంచార్జ్‌లతో ప్రమాణస్వీకారం చేయించి, వారికి పార్టీ పట్ల విశ్వాసం, ప్రజల పట్ల నిబద్దత, సేవాభావం కలిగిన నిజమైన కార్యకర్తలుగా మారాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజల మనస్సుల్లో నిలిచిన పార్టీ అని, మనమందరం ఒకే కుటుంబమని, పార్టీని స్థాపించిన మహానేత నందమూరి తారకరామారావు స్ఫూర్తి ప్రతి కార్యకర్తల్లో ప్రజాసేవా పట్ల అంకితభావాన్ని కలిగి ఉండాలన్నారు.



నూతన ఇంచార్జ్‌లుగా ప్రమాణం చేస్తున్న నాయకులు

ఆయన చూపిన ప్రజాహిత దిశ, విలువలు మన పార్టీ ఆత్మగా నిలిచాయన్నారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చూపిన దూరదృష్టి, క్రమశిక్షణ, ప్రజల పట్ల నిస్వార్థ నిబద్దత ప్రతి టిడిపి కార్యకర్తకు ఆదర్శమన్నారు. అనంతరం ఇంచార్జిలుగా నియమితులైన అందరికీ ఇది కేవలం బాధ్యత మాత్రమే కాదని, ఇది ఒక గౌరవమన్నారు. కావున ప్రతి బూత్ స్థాయిలో మన పసుపు జెండా ఎగురవేయడం మన కర్తవ్యమన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, నూతన ఇంచార్జిలు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి బాలోత్సవ్‌లో గురురాజ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న గురురాజ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** గుంటూరు నగరం నంబూరులో వి విఐటియు వారు నిర్వహించిన ప్రపంచ తెలుగు బాలల పండగ జాతీయస్థాయి బాలోత్సవ్-2025 పోటీలలో నంద్యాల పట్టణంలోని ఎన్‌జిఓ కాలనీ శ్రీగురురాజ ఇంటెలిష్ మీడియం పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ఏకంగా 47 బహుమతులు సాధించి ప్రభంజనం సృష్టించారని స్కూల్ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు. నవంబర్ 7,8,9 మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి బాలోత్సవంలో అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించారన్నారు. విజేతలకు వివిఐటియు చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ , సాహితీవేత్త గజల్ శ్రీనివాస్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ బహుమతులు ప్రధానం చేశారు. శాస్త్రీయ నృత్యం, కథారచణ, మట్టితో బొమ్మలు, జానపద



విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు

నృత్యం, డిజిటల్ డ్రాయింగ్, ఇంగ్లీష్ వక్తృత్వం, తదితర వాటిల్లో రాయలసీమలో మా విద్యార్థులు అత్యధిక బహుమతులు సాధించారన్నారు. తల్లిదండ్రుల సహకారంతోనే విజయాలు సాధిస్తున్నామని తెలిపారు.

## అట్టహాసంగా ప్యాపిలి పట్టణ అధ్యక్షుడు మధు ప్రమాణస్వీకారోత్సవం

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** ప్యాపిలి పట్టణ అధ్యక్షుడిగా మంగళవారం డోన్ పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కొంగనపల్లి మధు ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గం పరిశీలకులు హరి, టిడిపి నాయకులు ఎద్దుల దొడ్డి ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మినారాయణయాదవ్, సింగిల్‌విండో ఉపాధ్యక్షులు నడిగడ్డ నాగేంద్ర, వార్డు మెంబర్ వెంకటేష్, మల్లికార్జున, బోయిన్‌చెరువుపల్లి కాంతారావు, రాచర్ల శ్రీరాములు, ప్యాపిలి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొంగనపల్లి మధును సన్మానించిన టిడిపి నాయకులు

## పాములపాడు మండలంలో స్వామిత్వ గ్రామసభల నిర్వహణ

**పాములపాడు మేజర్ న్యూస్ :**

మండలపరిధిలోస్వామిత్వ గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ తెలిపారు.ప్రతి ఇంటి ఆస్తి వివరాలను పంచాయతీ కార్యదర్శులు కొలతలు వేసి, వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరచిన వివరాల ఆధారంగా 9(2) నోటిఫికేషన్‌లు ఇప్పటికే పంపిణీ చేసినట్లు తెలిపారు. చెలిమిళ్ళ గ్రామంలో 13 తేదీ, లింగాల, రుద్రవరం గ్రామాలలో 14, తేదీన, బానకచర్ల బానుముక్కల గ్రామాలు 16న, ఎర్ర గూడూరు 20, న, మిట్ట కందల,కంబాలపల్లె 21న, పాముల పాడు, మద్దూరు 22వ తేదీలలో



నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ నోటిఫికేషన్‌లపై గ్రామసభల్లో చర్చ జరగనుంది. గ్రామ ప్రజలకు తమకు ఉన్న అభ్యంతరాలు లేదా సూచనలు ఈ సభలో తెలియజేయవచ్చని **అధికారుల సూచన :** గ్రామ ప్రజలందరూ స్వామిత్వ గ్రామసభలకు హాజరై సహకరించవలసిందిగా పిలుపునిచ్చారు.

# మేము టిడిపి నాయకులం కాదా..?

**–స్వయంగా పట్టించిన టిప్పర్‌ను పోలీసులు ఎందుకు వదిలేశారు..!**
**–టిడిపిలో మాకు విలువ లేదా..?–ఆగ్రహం వ్యక్తం చేస్తున్న టిప్పర్ల యజమానులు**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** గత వారం రోజుల నుండి ప్యాపిలి మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య ఇసుక వార్ జరుగుతున్న సంగతి పాఠకులకు విధితమే. అయితే గత వారం రోజుల క్రితం టిడిపి నాయకులకు చెందిన తాడిపత్రి నుండి వచ్చిన మూడు ఇసుక టిప్పర్ల సమాచారాన్ని అదే తెలుగుదేశం పార్టీ నాయకులు పోలీసులకు సమాచారం ఇచ్చి మరీ పట్టించినట్లు టిడిపి నాయకల ఆరోపణ. అదే అనుమానంతో గత రెండు రోజుల క్రితం మరో టిడిపి నాయకుడికి చెందిన ఇసుక టిప్పర్‌ను సైతం అదే టిడిపి నాయకులు కలిసి పోలీసులకు పట్టించారు. అయితే స్వయంగా మేమే పోలీసులకు సమాచారం ఇచ్చి టిప్పర్‌ను పట్టిస్తే ఎందుకు పోలీసులు వదిలేశారంటూ టిడిపి మరోవర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో టిడిపి వర్గానికి చెందిన మూడు టిప్పర్లను విడిపించుకోవడానికి బాల నరసింహులు రూ.36వేలు, చిన్న కుళ్ళాయప్ప రూ.1,28,000లు, బసిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి రూ.62వేలు కప్పం కట్టి మరీ కొట్టించుకున్నట్లుందని, కాని మేమే స్వయంగా పట్టించిన ఇంకో వర్గానికి టిడిపి నాయకుడి టిప్పర్‌ను పోలీసులు ఎందుకు వదిలేశారని, ఎవ్వరు వదిలేయమని చెప్పారో మాకు తెలియాలని, మేము కూడా తెలుగుదేశం పార్టీలో ఉన్నామని, అయితే మాకు పార్టీలు విలువ లేదా అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చివరకు ప్యాపిలి తెలుగుతమ్ముళ్ళ ఇసుక వార్ ఇంతటితో ముగిస్తుందా లేక మరిన్ని పరిణామాలకు దారితీస్తుందా అని ప్రజలు బహిరంగంగానే గుసగుసలాడుకుంటున్నారు.

# రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే పరిశ్రమల ఏర్పాటు

**(మొదటిపేజి తరువాయి..)**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెద ఈర్లపాడు నుండి వర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రాహ్మణపల్లిలో రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పానీయాల ఉత్పత్తి యూనిట్ మెక్సికో తర్వాత రెండవ అతిపెద్ద యూనిట్‌గా నిలవనుందన్నారు. ఈ యూనిట్‌ను రిలయన్స్ సంస్థ రూ.3వేల కోట్ల పెట్టుబడితో నిర్మిస్తోందని, 5నెలల్లో పనులు పూర్తి చేస్తున్నారన్నారు. ఈ సంస్థ స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఇక్కడే స్కిల్ సెంటర్‌లు కూడా ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతి నియోజకవర్గంలో డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్‌లో ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలను కంబైన్డ్ చేసి స్కిల్ సెంటర్లను అభివృద్ధి చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల కారణంగానే ఇక్కడికి అనేక పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి తెలిపారు. అలాగే ఎయిర్‌పోర్ట్‌లో కూడా ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌కి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. అలాగే రూ.7వేల కోట్ల విలువ గల అగస్త్య సోలార్ పనులను జరుగుతున్నాయన్నారు. చిరస్థాయిగా ఇదే ప్రభుత్వం కొనసాగినట్లయితే ఇంకా ఎన్నో పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటిని బ్యాలెన్స్ చేస్తున్న ఏకైక నాయకుడు చంద్రబాబునాయుడు అని మంత్రి పేర్కొన్నారు. కలెక్టర్ డా.ఏ సిరి మాట్లాడుతూ జిల్లాలో 6ప్రాజెక్టులు, 3ఎంఎస్ఎంఈ పార్కులు సిఎం సమక్షంలో శంకుస్థాపన చేశామన్నారు. బ్రాహ్మణపల్లిలో ఏర్పాటు చేస్తున్న రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఎంఎస్ఎంఈ పార్క్ కొరకు 36.56ఎకరాలు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో పానీయాల ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేయనున్నారని మెక్సికో తర్వాత రెండవ అతిపెద్ద యూనిట్ అని కలెక్టర్ తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 5200మందికి ఉపాధి లభిస్తుందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు 2014లో ఇచ్చిన మాట ప్రకారం ఓర్వకల్లు మండలాన్ని ఇండస్ట్రియల్ హబ్‌గా చేసి ఎన్నో పరిశ్రమలు తీసుకురావడం జరిగిందన్నారు. దేశానికే కాదు ప్రపంచానికే తలమానికంగా ఇక్కడ డ్రోన్ హబ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రధాని మోడీ కూడా చెప్పారన్నారు. అలాగే సెమీకండక్టర్ ఓర్వకల్లు మండలానికి రావడం చాలా గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్, ఆర్డీఓ సందీప్ కుమార్, ఏపిఐఐసి జెడ్ఎం మధుసూదన్ రెడ్డి, రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్ లిమిటెడ్ సిబ్బంది, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

# సర్కారి స్కూల్.. చిదిలమైన రోడ్డు



దెబ్బతిన్న రహదారి మీద వెళ్తున్న విద్యార్థులు

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** గత 10 రోజుల క్రితం మొంతా తుఫాను ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసాయి. అయితే ఆ తుఫాను ప్రభావంతో వరద నీరు రావడంతో దెబ్బతిన్న ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల స్థితిగతులను యధాస్థితికి ఆయా కార్యాలయాల ఉన్నతాధికారులు తీసుకురావడం జరిగింది. అయితే బండిఆత్మకూరు మండలంలోని పెద్దదేవలాపురం గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారి, పాఠశాల ప్రహరీ చుట్టూ మొంతా తుఫాను ప్రభావంతో వరద నీరు చేరి కోతకు గురైంది. ప్రాథమిక పాఠశాలలో దాదాపు 70 మంది విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇంత మంది విద్యార్థిని విద్యార్థులు ప్రతిరోజు ఈ దారి వెంటే నడవాల్సి ఉంది. ప్రైమరీ స్కూల్ కావడంతో అందరు చిన్న పిల్లలు ఉండటం వల్ల దారిలో కింద పడుతూ లేస్తూ స్కూల్ యూనిఫార్మ్‌కు ప్రతిరోజు మట్టిని అంటించుకుని స్కూల్‌కు వెళ్తున్నారు. ఒకరిద్దరికి గాయాలైన సంఘటనలు ఉన్నాయి. అయితే తుఫాను ప్రభావం తగ్గి 10 రోజులు అవుతున్నా కోతకు గురైన రహదారిని, పాఠశాల చుట్టూ దెబ్బతిన్న ప్రహరీ గోడను పట్టించుకున్న దాఖలాలు లేవు. మండల స్థాయి విద్యాధికారులు అటువైపు చూసినట్లు లేరు. ఉన్నతాధికారులు ఈ ప్రభుత్వ పాఠశాల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నట్లు అద్దం పట్టినట్లు ఉంది. విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు బడికి వెళ్తే ఏ సమయంలో ఎలాంటి గాయాల బారిన పడతారోనని ఆందోళన చెందుతున్నారు. ఇదే తంతు కొనసాగితే వచ్చే విద్యా సంవత్సరానికి బడి పిల్లల సంఖ్య తగ్గే అవకాశం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు పునఃవైభవం తీసుకొస్తారని ఆశిద్దాం.

# బిగ్ బాస్కెట్ సంస్థ కలెక్షన్స్ సెంటర్ ప్రారంభం

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** మండల పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన బిగ్ బాస్కెట్ సంస్థ వారి కలెక్షన్స్ సెంటర్‌ను మంగళవారం రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐఏఎస్ అధికారిణీ నీరజ, జిల్లా ప్రకృత వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ మాధురి, స్టేట్ ఆర్వే ఎస్ఎస్ మార్కెటింగ్, సర్టిఫికేట్ ప్రాజెక్ట్ మేనేజర్ బిజయ్, బిగ్ బాస్కెట్ సంస్థ పల్లవి, రీజినల్ బిజినెస్ హెడ్ శ్రీలత, రీజనల్ బయింగ్, మర్చంటైజింగ్ హెడ్ శివరాం, రీజనల్ హెచ్ ఆర్ హెడ్ అనీల్‌రెడ్డి, రీజనల్ సోర్సింగ్ హెడ్ కలిసి ఎన్ఎఫ్ఏ మల్లికార్జున ఆధ్వర్యంలో బిగ్‌బాస్కెట్ మార్కెటింగ్ కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించారు.



# ఘనంగా యూనియన్ బ్యాంక్ స్థాపన దినోత్సవం



**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీస్ 107వ స్థాపన దినోత్సవాన్ని హోటల్ మంగళవారం మౌర్య ఇన్‌లో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి రీజనల్ హెడ్ నరసింహరావు హాజరై ప్రారంభించారు. సంస్థకు వారు అందిస్తున్న అంకితభావ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముంబై సెంట్రల్ ఆఫీస్ నుండి జరిగిన స్థాపన దినోత్సవ వేడుకల ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సిఈఓ ఆషిష్ పాండే సిబ్బంది, కస్టమర్లనుద్దేశించి సంస్థ సాధనల గురించి, భవిష్యత్తు లక్ష్యాల గురించి ప్రసంగించారు. కర్నూలు రీజియన్‌కు చెందిన అన్ని బ్రాంచ్‌ల సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాటలు, నృత్యాలు, ప్రశ్నోత్తర పోటీ వంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అన్నదాత ఆర్తనాదాలు వినండి – మాజీ ఎమ్మెల్యే గంగుల



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తామంటూ ప్రచారం చేసుకుంటూ తిరుగుతుందే తప్ప రాష్ట్రంలో తుఫాను ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణలో భాగంగా శిరివెళ్ల మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో మంగళవారం కోటి సంతకాల కార్యక్రమంలో గంగుల బిజేంద్రా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ సరైన నిర్ణయం కాదని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ప్రజలు, రైతులు పడుతున్న బాధలను దృష్టిలో ఉంచుకుని వారికి మేలు చేయాలని అన్నారు. అనంతరం గ్రామ నాయకులు కృష్ణా రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సర్పంచు సుభాన్ అలీలు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే నిరుపేద విద్యార్థులకు మెడికల్ విద్య దూరమవుతుందని అన్నారు. ప్రైవేటీకరణ చేయకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో శిరివెళ్ల ఎంపీపీ వసీమ్, ముజుబర్ హుస్సేన్, అబ్దుల్ సలాం, రఘునాథ్ రెడ్డి, హుస్సేన్ రెడ్డి, మేరిగ చిన్న నాగిరెడ్డి (బుచ్చి), ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో బీజేపీకి ప్రాధాన్యత ఎక్కడ?

**– కేంద్ర ప్రభుత్వ నిధుల పనుల శంకుస్థాపన, భూమి పూజలకు సమాచారం కరవు**
**– బీజేపీ నాయకుల పట్ల మండల అధికారుల నిర్లక్ష్య వైఖరి తగదు**





పోతుల రాజశేఖర్ రెడ్డి, శిలాఫలక దృశ్యం

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని వెలుగోడు మండల స్థాయి అధికారులు కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులైన భారతీయ జనతా పార్టీకి ఎక్కడా ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండల బీజేపీ అధ్యక్షుడు పోతుల రాజశేఖర్ రెడ్డి మంగళవారం తన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్యులు అందరు కలిసికట్టుగా ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని ఒక పక్క చెబుతున్నా మండల అధికారులు భారతీయ జనతా పార్టీ మండల నాయకులకు ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. తాము మండల స్థాయి అధికారులకు, బీజేపీ మండల స్థాయి నాయకుల ఫోన్ నెంబర్లు ఇచ్చినా తమకు సమాచారం ఇవ్వకపోవడంలో ఆంతర్యమేంటో అర్థం కావడం లేదని అన్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల శంకుస్థాపన, భూమి పూజలకు తమకు సమాచారం ఇవ్వకపోవడం అన్యాయమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వీడియో క్లిప్పింగ్స్ బీజేపీ రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యాలయాలకు అప్‌లోడ్ చేయకపోవడంతో రాష్ట్ర, జిల్లా నాయకులకు సమాధానాలు ఇవ్వలేకపోతున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ, ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో బీజేపీగా పాల్గొంటున్నారా అని రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు తమను ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు బీజేపీకి సముచిత స్థానం కల్పించి అన్ని కార్యక్రమాలకు సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల అధికారులు ప్రోటోకాల్ పాటించి అన్ని శిలాపలకాలపై ప్రధానమంత్రి మోడి ఫోటో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. అలాకాకపోతే మండల అధికారులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, తమ పార్టీ రాష్ట్ర నాయకులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# టీషర్టులు పంపిణీ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** విజయనగరం జిల్లాలో ఈ నెల 14నుంచి 16వ తేదీ వరకు జరిగే 12వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ (ఇంటర్ డిస్టిక్) వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు కర్నూలు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. వీరికి సాయి బాలాజీ ఆప్టికల్స్ అధినేత ఆంజనేయులు గౌడ్, కెఈ శివరాంగౌడ్‌ల చేతుల మీదుగా టీషర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ సంఘం సెక్రటరీ పాపా, డిఎస్ఏ కోచ్ యూసుఫ్ బాషా, స్టేడియం జెఎఫ్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సూర్య
బుధవారం | 12 నవంబరు 2025

# అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :**
అప్పుల బాధ తాళలేక రాఘవరామ్(23) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాలుక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఐటీసీ కంపెనీలో పనిచేస్తున్న రాఘవరామ్ తన అవసరం నిమిత్తం తోటి కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగుల వద్ద అప్పులు చేసుకున్నాడు. వారు తిరిగి డబ్బులు అడగడంతో ఒత్తిడి తాళలేక సోమవారం ఉల్చాలలోని తన ఇంట్లోనే పురుగుల మందు తెచ్చుకుని ఆత్మహత్యకు పాల్పడగా వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతిచెందాడు. తల్లి మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుక ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

# కూడళ్ల అభివృద్ధికి చర్యలు – కమీషనర్ పి విశ్వనాథ్


చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఆదేశిస్తున్న కమీషనర్ విశ్వనాథ్

**కర్నూలు (కెఎంసి), మేజర్‌న్యూస్ :** నగరంలోని కూడళ్లను ట్రాఫిక్ నియంత్రణకు వీలుగా కుదింపు, సుందరంగా తీర్చిదిద్దాలని నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్ ఆదేశించారు. మంగళవారం ఆయన శ్రీరామ్ థియేటర్ వద్దనున్న బసవేశ్వర కూడలిని పరిశీలించి చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ఆదేశాలు ఇచ్చారు. అలాగే దేవనగర్ ప్రాంతంలో పర్యటించి మౌలిక సదుపాయాల కల్పనకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో డిఈఈ క్రిష్ణలత, టీఏఈ మహేష్, ఖాజా మోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అనుభవాలు.. కొత్త దిశను కనుగొనేందుకే ఫ్యాషన్ టూర్

**ఎమ్మిగనూరు టౌన్,మేజర్‌న్యూస్ :**సాంకేతిక పరిజ్ఞానం– ఖరీదైన ఫ్యాషన్ దుస్తుల మధ్య వ్యత్యాసాన్ని తొలగించే విధంగా ఫ్యాషన్ ను అనుభవించే డైమెన్షన్లను మార్చే విధంగా పునర్విచిస్తుందని అనుభవాలు..కొత్త దిశను కనుగొనేందుకు ఫ్యాషన్ టూర్, దేశంలో ఫ్యాషన్కు అత్యంత నిర్దిష్టమైన స్వరం 2025లో మహత్తరమైన సంచికతో పున : ప్రవేశం చేస్తోంది. "ద ఫ్యూచర్ వెర్స్ ఆఫ్ ఫ్యాషన్" తో గుర్గావులో ఫ్యాషన్ అనుభవాల భవిష్యత్తును అనావృతం చేస్తూ బ్లెండర్స్ ప్రైడ్ ఈ టూర్ ఒక దిశను నిర్దేశిస్తుందని చెప్పారు. 2021 విశ్వసుందరి హర్నాజ్ సంధూ యొక్క శైలిని, ర్యాపర్ రఫ్తార్ యొక్క అపారమైన శక్తిని ప్రదర్శించే ఈ చాప్టర్ పూర్తి స్థాయిలో ఉత్తేజ భరితమైన, సాహసోపేతమైన, అసమాన్యమైన గ్లామర్ ను కలిగి ఉండే ఫ్యాషన్ తప్పక అందిస్తుందన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి



**పాములపాడు మేజర్ న్యూస్ :** నంద్యాల జిల్లాలో మొక్కజొన్న రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం అఖిలభారత కిసాన్ మహాసభ బృందం మొక్కజొన్న రైతులను కలిసి పంటలను పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "రైతులు ఖరీఫ్ సీజన్‌లో విస్తారంగా మొక్కజొన్న పంట పండించారు. కానీ తుఫానులు, వర్షాల కారణంగా దిగుబడి తగ్గి ఎకరాకు 15 క్వింటాల్స్ కూడా రాకుండా నష్టపోతున్నారని . ఒక ఎకరాకు ?30 నుండి ?40 వేల వరకు పెట్టుబడి పెట్టి పండించిన పంటలు ఇప్పుడు పెట్టుబడీ కూడా చేతికి రాని పరిస్థితిలో ఉన్నారు కౌలుకి తీసుకొని సాగు చేసే రైతు పరిస్థితి ఇంకా దయనీయంగా " అని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ప్రభుత్వం మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారస్తులు, దళారులు కుమ్మక్కై క్వింటాలుకు ?1600–1700కే కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులు క్వింటాలుకు సుమారు ?600 నష్టం చవిచూస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే మొక్కజొన్న పంట 60 శాతం కోత పూర్తయిందని, తక్షణమే మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు అన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు మరియు కౌలు రైతులకు ఎకరాకు ?40,000 నష్టపరిహారం చెల్లించాలని, అలాగే రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు టి. నరసింహులు, వేల్పుల ఏసన్న, శ్రీరాములు, రైతులు గొల్ల సురేష్, ఎస్. సద్దాం, నబి రసూల్ అల్లా, ప్రకాష్, మహేష్, మన్సూర్, రాజు, శాలు భాష తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధిలో మౌలానా అబుల్ కలాం సేవలు అపూర్వం



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** భారత స్వాతంత్ర సమరంలో, విద్యాభివృద్ధిలో అపూర్వ సేవలు అందించిన గొప్ప వ్యక్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం జయంతి వేడుకలను జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎస్పీ సునీల్ షెరాన్ అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించా రు. అబుల్ కలాం స్వాతంత్ర సమరంలో మహాత్మా గాంధీ అనుచరుడుగా పని చేశారని అన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో ముఖ్య పాత్ర పోషించా రని అన్నారు. మన దేశానికి మొదటి విద్యా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని అన్నారు. ఐఐటిలు, యుజిసి, జాతీయ విద్యా మండలి వంటి ఎన్నో విద్యా సంస్థల స్థాపనలో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. ఆయన సేవలకు గుర్తుగా నవబంరు 11న జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ యుగంధర్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సిఐలు, పోలీసు కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కడమకుంట్ల,మామిళ్లకుంట గ్రామాలలో రచ్చబండ..కోటి సంతకాల సేకరణ

**పేదలను విద్యావంతులు కాకుండా అడ్డుకుంటున్న కూటమి ప్రభుత్వం**
**వైయస్సార్ సిపి జిల్లా కార్యదర్శి మోహన్ రెడ్డి , వైసిపి నేత అమర్నాథ్ రెడ్డి**


కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న వైసిపి నాయకులు

**తుగ్గలి,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో పేదలను విద్యావంతులు కాకుండా కూటమి ప్రభుత్వం అడ్డుకుంటుందని వైఎస్ఆర్సిపి జిల్లా కార్యదర్శి మోహన్ రెడ్డి బూత్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి అన్నారు .మంగళవారం సాయంత్రం కడమకుంట్ల మామిళ్ళకుంట గ్రామంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రైవేట్ పరం చేయొద్దంటూ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి, కోటి సంతకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వము ప్రభుత్వ మెడికల్ కళాశాలల ను ప్రైవేటు పరం చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో మోహన్ రెడ్డి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలల ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టేందుకే ప్రైవేటీ కరణ చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ప్రజలను తీరని ఇబ్బందుల్లోకి నెట్టారని విమర్శించారు. ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని గత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని కొనియాడారు. 17 మెడికల్ కళాశాలలకు దాదాపు రూ.8 వేల కోట్ల బడ్జెట్ కేటాయించారని గుర్తు చేశారు. అలాంటి మెడి కల్ కళాశాలలను నేడు సీఎం చంద్రబాబు ప్రైవేటీక రణ చేస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములవుతుండడం హర్షణీయమన్నారు. చంద్రబాబు ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. అందువల్ల బుధవారం పత్తికొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే శ్రీ దేవమ్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమ ర్యాలీలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు విరిగిట్ల విష్ణువర్ధన్ రెడ్డి సత్తప్ప సంఘాల సురేష్ మాజీ సర్పంచ్ సునీత, ఎంపీటీసీ ఆదిలక్ష్మి, మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు, వైసిపి విద్యార్థి విభాగపు అధ్యక్షులు రాజశేఖర్, వైసిపి నాయకులు లంకాయపల్లి హనుమంత్ రెడ్డి, రమేష్, కృష్ణ నాయక్, దాసు నాయక్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

# సస్యరక్షణ చర్యలతో నే అధికదిగుబడులు సాధ్యం



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ

**గోనెగండ్ల,మేజర్ న్యూస్:** రైతులు పంటలలో అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు తప్పని సరిగా పాటించాలని ఏరువాక ప్రధానశాస్త్రవేత్త సుజాతమ్మ అన్నారు. మంగళవారం గోనెగండ్ల మండలం పరిధిలోని పుట్టపాశం, తిప్పనూరు గ్రామ పంట పొలాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్త సుజాతమ్మ, శాస్త్రవేత్త సతీష్, ఏడీఏ మహుమ్మద్ ఖాద్రీ కంది, మొక్కజోన్న పప్పుశనగ పంటలను పరిశీలించారు. పంటలలో జింక్ లోపం ఉన్నట్లు వారు గుర్తించారు. అలాగే మొక్కజోన్న పంటకు కత్తెర పురుగు సోకినట్లు తెలిపారు.పురుగు నివారణకు ఏమామెక్టిన్ బెంజోఏట్ 0.3 గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి మొక్కల సుడిలో వేయాలన్నారు. అలాగే జింక్ నివారణ కోసం జింక్ సల్ఫేట్ ను 0.3 మిల్లి లీటర్లు ఒక లీటర్ నీటిలో కలుపుకొని పంటకు పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. కంది పంటలో మారుకా మచ్చల పురుగునివారణకు నోవాలరాన్ 1మీల్లీలీటరు ను ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేయాలన్నారు. అలాగే పప్పుశగన సాగులో విత్తన శుద్ది ని గురించి రైతులకు వివరించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పులిరాజు, అరుణ, తస్లీమ్, రఘు, గ్రామ రైతులు కౌలుట్ల, ఎలీసా, రామకృష్ణ పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణంలో ఆర్అండ్‌బి నిబంధనలు పాటించాలి

**-ఆర్అండ్ బి అధికారులకు ప్రజల విన్నపం..**
**-గ్రామ తరాల భవిష్యత్ కై రోడ్డు నిర్మాణంలో నిబంధనలు పాటించాలని డిమాండ్**
**-రోడ్డుకిరువైపులా మార్కింగ్ లేకుండా రోడ్డు నిర్మాణం ప్రారంభం**
**-ఆర్అండ్బి అధికారులు నిబంధనలు పాటించడం లేదని ప్రజా వ్యతిరేక గానం.**



**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** సి.బెలగల్ మండలంలో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణంలో ఆర్అండ్బి అధికారులు నిబంధనలకు తోట్లు పొడిచారు.రోడ్డు విస్తరణకు ఆర్అండ్బి అధికారులు కనీసం మార్కింగ్ లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడం మండల ప్రజానీకాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది.మండలంలో దశాబ్దాలుగా రోడ్డు అభివృద్ధికి నోచుకోక ఎన్నో ఏళ్ల తర్వాత మండలానికి రోడ్డు నిర్మాణం పనులు అభివృద్ధికి సూచికగా మారబోతున్నాయని భావించిన ప్రజలకు ఒకింత నిరాశ నిస్పృహ కలిగింది.ఎన్నో ఏళ్ల తర్వాత మండలంలో రోడ్డు నిర్మాణం చేపట్టిన అధికారులు రోడ్డు విస్తరణలో కనీస నిబంధనలో నియమాలు పాటించకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడం మండల ప్రజలను ఆశ్చర్యాన్ని గురిచేసింది.రోడ్డు వెంబడి కిలోమీటర్ రోడ్డుకు రెండు వైపులా ఆక్రమించుకున్న స్థలాన్ని ఆర్అండ్బి అధికారులు రోడ్డు స్థలానికి మార్కింగ్ వేయాలని ఇది మండల అభివృద్ధికి దోహదపడుతుందని అందరూ భావించారు.కానీ రోడ్డు నిర్మాణంలో ఆర్అండ్బి అధికారులు కనీస చర్యలు తీసుకోకుండా రోడ్డు వెడల్పు మార్కింగ్ లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడం దారుణమని ఇప్పటికైనా ఆర్అండ్బి అధికారులు,మండల పరిషత్ అధికారులు చొరవతీసుకొని మండల అభివృద్ధికి సూచికైనా రోడ్డు నిర్మాణాన్ని విస్తరణను ఏర్పాటు చేయాలని మండలానికి వచ్చిన ఆర్అండ్బి అధికారులను ప్రజలు గుమ్మిగుడి ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆర్అండ్బి అధికారులు పైఅధికారులకు రిపోర్ట్ చేస్తామని అక్కడి నుంచి వెళ్ళిపోయారు.

# గ్రామ పంచాయతీ భవనంను అద్దెకుఇచ్చిన గ్రామసర్పంచ్ ..?

**-పంచాయతీ భవనంకు ప్రతి నెల అద్దెతో పాటు కరెంట్ బిల్లు చెల్లింపు**
**-పంచాయతీ భవనం లేకా .. ఆరోగ్య ఉప కేంద్రమా..**

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల కేంద్రంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గ్రామ సర్పంచ్ ప్రాథమిక వైద్యా ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఒక ప్రభుత్వ ఉద్యోగులకు అద్దెకు ఇచ్చినట్లు విస్వశనీయ సమాచారం. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలాయానికి 2024సంవత్సరం నుండి సుమారుగా 20 నెలలు నుండి అద్దెచెల్లింపులు జరిగినట్లు ఎం. ఎల్ హెచ్ పి. ద్వారా తెలిసింది. ఇప్పటికే రూ14.000 వేలు రూపాయలు వరకు చెల్లించినట్లు. మొత్తాన్ని పంచాయతీ కార్యదర్శి. గ్రామ సర్పంచ్.వైసీపీ నాయకులకు చెల్లించడం జరిగింది. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయానికి విద్యుత్ మీటర్ కోసం రూ4వేలు రూపాయలు కూడా చెల్లించినట్లు సమాచారం. ప్రభుత్వం భవనం కదా? అద్దెందుకు తాము చెల్లించాలని ఎం. ఎల్ హెచ్ పి సంబందిత సర్పంచ్. పంచాయతీ కార్యదర్శిని అడిగితే అందుకు సర్పంచ్. గ్రామ పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ మీరు చెల్లించిన అద్దెమొత్తంను గ్రామంలోని రోజువారీ పనులు చేసే పారిశుధ్యం కార్మికులకు జీతాలు చెల్లించేందుకు ఉపయోగిస్తున్నాట్లు ఆ ఉద్యోగికి సమాదానం చెప్పు తున్నట్లు సమాచారం. అయితే స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాంగ మార్చడంవల్ల. గ్రామసభలు. పంచాతీ తీర్మానాలు చేసుకోనేందుకు ఎక్కడ చేసుకోవాలి అంటు గ్రామవార్డుసభ్యులు సర్పంచ్. పంచాయతీ కార్యదర్శి పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. అలాగే గ్రామంలోపలు ప్రభుత్వ భవనాలు ఖాళీలు ఉన్నప్పటికి గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ఎందుకు ఆరోగ్య ఉప కేంద్రం ఏర్పాటు చేసినట్లు స్థానిక గ్రామస్తులు తీవ్రంగా విమర్శలు వినిపిస్తున్నాయి.



# జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమం పై శిక్షణ

**దొర్నిపాడు,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని డబ్ల్యూ కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నందు వైద్యాధికారి డాక్టర్ ఉస్సేని నేగల ఆధ్వర్యంలో ఎమ్ ఎల్ హెచ్ పి లు, ఏ ఎన్ ఎమ్‌లు, ఆశా వర్కర్స్ మరియు మెల్ వాలంటీర్లలకు (ఎల్‌సిడి సి )జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్బంగా డాక్టర్ ఉస్సేని నే గల మాట్లా డుతూ ఈ నెల, 17-11-25నుండి 30-11-25వ తేదీ వరకు పి హెచ్ సి పరిధి లోని గ్రామాలలో వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించే సర్వే



కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని ఎవరికైనా స్పర్శ లేని రాగిరంగు గల మచ్చలు ఉండటం, కనురెప్పలు మూతపడ కపోవటం అరచేతులు అరికాళ్ళు స్పర్శ కోల్పోవడం, కాళ్ళ చెప్పులు జరిపోవడం, పాదాల వాపు ఉండటం, చేతివేళ్ళు, కాలివె ళ్ళు వంకర్లు తిరిగి అంగ వైకల్యం రావడం, కాళ్ళు చేతులు తిమ్మిర్లు జోములు కలిగి ఉండుట పై అనుమానిత లక్షణాలు ఉన్న యెడల ఆరోగ్యకార్యకర్త మీ ఇంటివద్దకు సర్వేకు వచ్చినప్పుడు చూపించుకోవాలని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని డాక్టర్ సంప్రదించి ఉచిత మందులను పొందాలని ప్రజలు జాతీయకుష్టు వ్యాధి నిర్మూలనకార్యక్రమాన్ని సద్వినియోగం చేసు కొని సహకరించాలని సూచించారు. ప్రాథ మిక వైద్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉస్సే ని నే గల, ఎంపీ హెచ్ ఈ ఓ బాబయ్య ఎమ్ ఎల్ హెచ్ పి లు, ఏ ఎన్ ఎమ్ లు, ఆశా వర్కర్స్,మెల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యా శాఖ మంత్రి భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలు ఆళ్లగడ్డలో ఘనంగా జరి గాయి. ఈ సందర్భంగా అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం యూనిట్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు టి అమీర్ బాషా ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ పట్టణం లోని కెవి సుబ్బారెడ్డి హైస్కూల్లో కరస్పాండెంట్ ఓబన్న, ఉపాధ్యాయ బృందం విద్యార్థులతో కలిసి భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమా ల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు టి.అమీర్ భాష మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ప్రాథమిక విద్య, ఉన్నత విద్య,సెకండరీ విద్య, శాస్త్రీయ విద్య, వయోజన విద్య, బాలికల గ్రామీణ విద్య, సాంకేతిక విద్య ఎన్నో రకాల విద్యాసంస్కరణలను ప్రవేశపెట్టిన మహనీయుడు



పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మూలన అబ్దుల్ కలాం ఆజాద్ అన్నారు. ఆయన జర్నలిస్టుగా, రచ యితగా, కొత్తగా, బహుభాషా కోవిదుడుగా, స్వాతంత్ర్య సమరయో ధుడుగా తత్వవేత్తగా భారతీయుల గుండెల్లో చిరస్మయుడుగా నిలిచిపోయాడన్నారు.

# ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** కోడుమూరు పట్టణంలోని సంత మార్కెట్‌లోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో మైనార్టీ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని ముస్లిం మైనార్టీల ఐక్యవేదిక ఆద్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారిణి వసంతలక్ష్మి బాయి హాజర య్యారు. ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఇంతియాజ్ బాషా, క్రిసెంట్ స్కూల్ కరస్పాండెంట్ ఖాజా హుస్సేన్, చిన్న మస్జీద్, పెష్మామ్, అబ్దుల్ అజీమ్, జామి యా మస్జీద్ పేష్మామ్‌లు హాజరయ్యారు. కార్యక్రమానికి గ్రామాభివృద్ధి కమిటీ




మాట్లాడుతున్న ఎంఈఓ వసంత లక్ష్మి బాయి

అధ్యక్షులు డా. షాకీర్ అధ్యక్షత వహించా రు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నాడు స్వాతంత్ర్యం అనంతరం మొట్టమొ దటి విద్యా శాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ బాధ్యతలు తీసుకుని ఆయన పరిధిలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని కొనియాడారు. దేశ స్వాతంత్ర పోరాటం కోసం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రజలను కులమత భేద భావం లేకుండా అందరిని సమీకరించారని స్వాతంత్ర ఉద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం కోడుమూరు పట్టణంలో ఉర్దూ హైస్కూల్ అభివృద్ధికి డాక్టర్ షాకీర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు అస్లాం బాష, ఉర్దూ పాఠశాలల హెచ్‌ఎంలు మహబూబ్‌బీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్య విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** కల్లూరు అర్బన్ పరిధిలోని శ్రీనగర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు నాసా కిట్లను కామి నేని హాస్పిటల్ ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్ డా.జయశ్రీ, పాఠశాల ఆర్ఐ రామాంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్క విద్యార్థి శాస్త్రీయ దృక్పథా న్ని అలవరచుకుని నిర్దేశించుకోవాలని ఆ లక్ష్యాల వైపు శాస్త్రీయ పరిజ్ఞానంతో పయనించాలని తెలియజేశారు. ఫిజిక్స్ యొక్క ప్రాముఖ్యతను అది మన జీవితంలో ఎలా ఉపయోగపడుతుందనే విషయాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో



కిట్లు అందుకున్న విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం, డాక్టర్లు

పాఠశాల డీన్ హుస్సేన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కోవెలకుంట్లలో పెరిగిన కుక్కల బెడద

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్లలోని పలు వీధుల్లో కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోవెలకుంట్ల-నంద్యాల, కోవెలకుంట్ల-జమ్ములమడుగు, కోవెలకుం ట్ల-బనగానపల్లె, కోవెలకుంట్ల-అవుకు ప్రధాన రోడ్లతో పాటు పలు వీధుల్లో కుక్కల సంచారం ఎక్కువ కావడంతో పిల్లలు, పెద్దలు బయటికి వెళ్లాలంటే హడలిపోతున్నారు. ఇప్పటికే కొంత మంది కుక్క కాటుకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వైద్యం చేయిం చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయం సంబంధిత అధికా రుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడదను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



# మిరప రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

★పొలం పిలుస్తుంది కార్యక్రమంలో అధికారి సరిత సూచనలు




పోలంబాట పట్టిన ఏఓ సరిత

**నందవరం, మేజర్‌న్యూస్ :** మిరప పంట పై రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాల ని మండల వ్యవసాయ అధికారి సరిత పిలుపునిచ్చారు. మంగళవారం పొలం పిలుస్తుంది , భూమాత సంరక్షణ కార్యక్ర మంలో బాగంగా నందవరం మండల కేంద్రం సరిహద్దుపొలాల్లో మిరప పంట లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిరప పంటలో రసం పీల్చుపురుగులతో పంటలు దిగుబడులు తగ్గుతాయన్నారు. కావున రైతులు కింది ఆకు ముడత, పై ఆకు ముడతను గుర్తించి సరైన మందులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పిచికిరి చేయించాలన్నారు. పంటలు సాగుకు ముందు భూసార పరీక్షలు చేయించుకుని రైతులు అనుకూలమైన పంటలను సాగుచెయ్యాలన్నారు. సాధ్యమైనంత వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడుతూ భూసారాన్ని పెంచుకోవాలని సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించకుంటే చర్యలు

**చాగలమర్రి , మేజర్ న్యూస్ :** సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో తాహీర్ హుస్సేన్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పెద్దబోధనం సచి వాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచి వాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాద



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

పూర్వకంగా ప్రవర్తించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరగకుండా త్వరితగతిన పరిష్కరించాలన్నారు.సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్ ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బస్సుల్లో కొనసాగుతున్న తనిఖీలు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ఆర్టీసి ట్రావెలింగ్ బస్సులు, ముఖ్యంగా రాత్రి పూట తిరిగే బస్సులలో సరైన భద్రతా చర్యలు, జాగ్రత్తలు పాటించాలని బస్సుల్లో తనిఖీలు నిర్వహి స్తున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణ కు స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అర్థరాత్రి నుండి తెల్లవారుజాము వరకు కర్నూలు పోలీసులు భారీ వాహనాలకు స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. హైదరాబాద్ -బెంగళూరు, హైదరాబాద్-చెన్నైల నేషనల్ హైవే-40, 44లలో లారీలు, బస్సులు, కార్లు, మినీ వ్యాన్లు, లగేజీ బొలేరోలను పోలీసులు ఆపి ఆ డ్రైవర్లకు నీళ్లతో ముఖం కడిగించి పంపిస్తున్నారన్నారు. వాహనాలను వేగంతో నడపకుండా, రాంగ్ రూట్‌లో వెళ్లకుండా, పరి మితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# ఆజాద్ సేవలు మరువలేనివి

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు భారత జాతి ఎప్పటికీ మరువలేనివని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసిసి సభ్యులు ఎం సుధాకర్ బాబు అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతిని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించారు. ముందు గా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి



ఆజాద్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో సుధాకర్ బాబు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యార్థుల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. పత్తికొండ నియోజకవర్గ కోఆర్డినేటర్ క్రాంతి నాయుడు, బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

# యాగంటిలో వేలం పూర్తి



వేలాలు నిర్వహిస్తున్న దృశ్యం

**బన గాన పల్లె రూరల్ మేజర్ ,న్యూస్:** యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవ స్థానం నందు తల నీలాలు పొగు చేసుకునే హక్కు కోసం మంగళవారంనాడు వేలం నిర్వహించారు. ఈ వేలాన్ని చాగలమర్రికి చెందిన కోటపాడు నాగేంద్ర రూ. 2,4500 0లకు వేలం దక్కించుకున్నారు. ఈ వేలం దక్కించుకున్న వారు 13 నవంబరు 2025 నుండి 12 నవంబరు 2026 వరకు తల నీలాలు పోగు చేసుకోవచ్చు .

**తాత్కాలిక హుండీ లెక్కింపు :** యాగంటి శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవస్థానం నందు కార్తీకమాసం సందర్భంగా తాత్కాలిక హుండీ లెక్కింపును చేపట్టారు. భక్తులు కానుకల రూపంలో స్వామి వారికి రూ. 93,201లు ఆదాయం చేకూర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈ.ఒ పాండురంగారెడ్డి, పర్యవేక్షకులు బ్రహ్మానంద రెడ్డి, యాగంటిపల్లె మౌళీశ్వర రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య



# మల్లన్నను దర్శించుకున్న మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డితో కలిసి శ్రీశైలం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రికి దేవస్థానం చైర్మన్ రమేష్ నాయుడు, ఈవో శ్రీనివాసరావు,అధికారులు,అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.ప్రత్యేక పూజలు అనంతరం వేద ఆశీర్వచనలు అందించి శేష వస్త్రం,లడ్డు ప్రసాదాలు,జ్ఞాపికతో సత్కరించారు.

## మౌలానా అబుల్ కలాం అజాద్ సేవలు స్ఫూర్తిదాయకం- జేసీ కార్తీక్



చిత్రపటానికి పూలమాల వేస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** భారతదేశాభివృద్ధికి పునాది వేసిన మహనీయుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, భారత తొలి విద్యామంత్రి భారతరత్న మౌలానా అబుల్ కలాం అజాద్ సేవలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. ఆయన జయంతి సందర్భంగా మంగళవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ మౌలానా తమ ఆలోచనా దృఢత, విద్యాభివృద్ధిపై ఉన్న దృష్టిలో దేశానికి అజరామరమైన సేవలు అందించారన్నారు. ఆయన ఆల్ హిలాల్ అనే దినపత్రిక ద్వారా స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రజల్లో నింపారని వివరించారు. ముఖ్యంగా యువతలో పోరాట స్ఫూర్తిని పెంపొందించి దేశభక్తి భావనను రగిలించారని పేర్కొన్నారు. విద్య కేవలం వ్యక్తిగత ఎదుగదలకే పరిమితం కాదని అది సమాజ అభివృద్ధికి మార్గదర్శకం అన్నారు. ఐకమత్యం, సమన్వయం అనే విలువలతో ముందుకు సాగితేనే దేశం సమగ్రాభివృద్ధి సాధించగలదన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ మౌలానా అజాద్ గారి జీవితంలో ఉన్న నిబద్ధత, త్యాగం, సేవా భావం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కావాలన్నారు. ఆయన చూపిన దారిలో నడుస్తూ మనమంతా సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా అజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఏపీ ముస్లిం మైనారిటీ డైరెక్టర్ ఖలీల్, మైనారిటీ సంక్షేమ అధికారి సబీహా పర్వీన్, జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధన్‌రెడ్డి, కమిషనర్ శేషన్న, ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# వ్యభిచార గృహాలపై పోలీసుల దాడి

**-పోలీసుల అదుపులో 11 మంది వ్యక్తులు**

**కర్నూలు క్రైమ్ మేజర్ న్యూస్ :**

నగరంలోని ఉల్చాల రోడ్డు ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యభిచార ముఠా పై నాలుగో పట్టణ పోలీసులు మంగళవారం దాడి చేసి 11 మందిని అదుపులో తీసుకొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గత కొంతకాలంగా నగరంలోని ఉల్చాల రోడ్డు ప్రాంతంలో ఓ ఇట్టిని అద్దెకు తీసుకొని వ్యభిచారం నిర్వహిస్తున్న సమాచారం రావడంతో నాలుగో పట్టణం పోలీసులు దాడులు నిర్వహించారు. డోనుకు చెందిన ప్రధాన సూత్రధారులు హరి యాదవ్, దూదే కొండకు చెందిన మధుసూదన్‌లు. ఉల్చాల రోడ్డులో ఇల్లు అద్దెకు తీసుకొని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అమ్మాయిలను తెచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారం. వీరందరినీ ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నారు.ఇందులో నిర్వాహకులు వీటిలో బాధితులు బాధితులను 11 మంది ఉన్నారు.

# పర్యాటకరంగ అభివృద్ధికై స్థలాలను పరిశీలించిన కలెక్టర్



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** సున్నిపెంట ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికు అనువైన ప్రాంతాలను గుర్తిస్తున్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. మంగళవారం శ్రీశైలం మండలంలోని సున్నిపెంట ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి అనువైన ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సున్నిపెంట ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి అనువైన ప్రదేశాలను గుర్తించే క్రమంలో భాగంగా సుమారు 49 ఎకరాల స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.సున్నిపెంట శ్రీశైలం సమీప ప్రాంతం కావడంతో,ఇక్కడ పర్యాటక రంగ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.ఈ ప్రాంతాన్ని ఆధునిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.పరిశీలించిన 49 ఎకరాల స్థలంలో హెూటళ్లు, రిసార్టులు,పార్కులు,పర్యాటక సదుపాయాలు,సాంస్కృతిక కేంద్రాలు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతంలో పర్యాటక వసతులు విస్తరించడం ద్వారా భక్తులు, పర్యాటకులకు మరింత సౌకర్యాలు లభించడంతోపాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. పర్యాటక అభివృద్ధి కేవలం ఆర్థిక పరంగా కాకుండా,సామాజిక, సాంస్కృతిక ప్రగతికి కూడా దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు.ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి,టూరిజం శాఖ అధికారులు,తహసీల్దార్ తదితర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# మాంటిస్సోరి పాఠశాల స్వర్ణోత్సవ వేడుక

**:- 50వసంతాల విద్యాసేవలో కర్నూలు మాంటిస్సోరి పాఠశాల**



మాంటిస్సోరి వ్యవస్థాపకురాలు కళ్యాణమ్మ

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** నగరంలో విద్య ప్రమాణాలకు మారుపేరుగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన కర్నూలు మాంటిస్సోరి పాఠశాల ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. 50వసంతాల విద్యా యజ్ఞం పూర్తి చేసుకుని స్వర్ణోత్సవ శోభను సంతరించుకోవడం కర్నూలు పట్టణానికి గర్వకారణంగా నిలిచిందని పాఠశాల యాజమాన్యం అన్నారు. ఈ సందర్భంగా స్వర్ణ జయంతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి నేడు పాఠశాల యాజమాన్యం సిద్ధమవుతుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 50సం॥ల క్రితం కర్నూలులోని విద్యానగరాల్లో కేవలం 12మంది విద్యార్థులతో ఒక చిన్న మొక్కగా ప్రస్థానం ప్రారంభించి నేడు శాఖోపశాకలుగా విస్తరించి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని 9ప్రాంతాలలో శాఖలను విస్తరించి సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. నాణ్యమైన విద్య వినూత్న బోధన పద్దతులు అద్భుతమైన ఫలితాలతో ఈ రాయలసీమలోనే ఒక మకుటాయమాన విద్యాసంస్థగా మాంటిస్సోరి పాఠశాల ఎదిగిందన్నారు. క్రమశిక్షణ, నిజాయితీ, పెద్దల పట్ల గౌరవం, సామాజిక స్పృహ వంటి మహోన్నత లక్షణాలను విద్యార్థి మదిలో నింపడం ఈ పాఠశాల ప్రత్యేకత అన్నారు. నాణ్యతతో కూడుకున్న విద్యకు, సంస్కారానికి చిరునామాగా తీర్చిదిద్దిన పాఠశాల వ్యవస్థాపకులైన కళ్యాణమ్మ కలను సాకారం చేస్తున్న ఉపాధ్యాయులకు, బోధనేతర సిబ్బందికి, పూర్వ విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాబోయే తరాలకు కూడా ఈ పాఠశాల ఇదే స్ఫూర్తితో వెలుగులు విరజిమ్మాలని ఈ విశిష్ట సందర్భాన్ని పురస్కరించుకుని పాఠశాల స్వర్ణ జయంతి ఉత్సవాలు నేడు రాష్ట్ర గవర్నర్ డా.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డెన్ జూబ్లీ వేడుకలను ప్రారంభించనున్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల ఎంపిలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు పార్థసారథి, దస్తగిరి, జయసూర్య, జయనాగేశ్వరరెడ్డి, కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్, జిల్లా కలెక్టర్ డా.ఏ సిరితో పాటు ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.

# 10వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్:** వెల్దుర్తిలోని జర్నలిస్టు కాలనీలో వెలసిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వర, శ్రీసద్గురు సాయినాథ, శ్రీకేదారేశ్వర, శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో 10వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఆలయం ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ఉదయం అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్నట్లు, అనంతరం మద్యాహ్నం అయ్యప్ప స్వామి పడి వెలిగించి ప్రత్యేక పూజ కార్యక్రమం ఉంటుందననారు. అదేవిధంగా సాయంకాలం గ్రామంలో అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్ళనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు యార్లపాటి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వార్ల ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరారు.




# ఇంటికో పారిశ్రామిక వేత్త ఉండాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యం

- **మంత్రాలయంలో త్రీస్టార్ హోటల్‌ను వర్చ్యువల్‌గా సీఎం శంకుస్థాపన**
- **ఆదోని, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు, మంత్రాలయం టీడీపీ ఇంచార్జీ**



శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు, టీడీపీ ఇంచార్జీ



శంఖుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ప్రముఖులు



ఎమ్మెల్యేలకు స్వాగతం పలుకుతున్న హోటల్ యజమాన్యం

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** ఇంటికో పారిశ్రామిక వేత్త ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆదోని, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు పార్థసారధి, బి.వి.జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జి రాఘవేంద్రరెడ్డి, జనసేన పార్టీ ఇంచార్జీ లక్ష్మన్నలు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మంత్రాలయంలోని పరిశ్రమలు ఉపాధి కల్పనలో భాగంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు మంత్రాలయంలో త్రీ స్టాల్ హోటల్ నిర్మాణానికి వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారు.ఈకార్యక్రమానికి అతిథులుగా విచ్చేశారు. ముందుగా వారు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్బంగా వారుమాట్లాడుతూ, రాఘవేంద్ర స్వామి ఆశీస్సులు ఏపి ప్రధా నమంత్రి నరేంద్రమోడీ నేతృత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి నారాలోకేష్, టూరిజం శాఖ మంత్రి కందుల సురేష్ సహకారంతో దాదాపు రూ.100కోట్లతో మంత్రాలయంలో త్రీ స్టార్ హోటల్ నిర్మించడం, రాష్ట్రంలో 87 ఎంయంఎస్ పార్కులకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉన్నారు. ఒక టూరిజం పాలసీ తీసుకొచ్చి మంత్రాలయంలో త్రీస్టాల్ హోటల్ నిర్మంచడంతో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. టూరిజంలోభాగంగా, మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు దేశ నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారని వారి సౌకర్యంకొరకు త్రీస్టార్ హోటల్ నిర్మించడం జరుగుతుందన్నారు. గత పాలనలో ఒక్క పరిశ్రమను కూడ తీసుకురాలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెట్టుబడులతోపాటు ఉద్యోగ అవకాశాలు కూడ పెరుగుతాయన్నారు. ఆబౌడి హోటల్ ఎండిఆర్‌యస్ కార్తీక, డిప్యూటీ జనరల్ మేనేజర్ తివారి, హోటల్ మేనేజర్ రజినీకాంత్, సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తహశీల్దార్ రమాదేవి, ఎస్.ఐ శివాంజల్, ఎంపిడిఓ నూర్జాహాన్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రరె డ్డి, విద్యుత్ శాఖ ఏఈ గోవిందు, టీడీపీ నాయకులు చావిడి వెంకటేష్, మాజీ జెడ్పిటీసీ లక్ష్మ య్య, కల్లుదేవకుంట సహకార సంఘం డైరెక్టర్ లక్ష్మన్న, మంచాల సొసైటీ డైరెక్టర్లు డిసి తిమ్మప్ప, చాపల నాగేష్, పట్టణ అధ్యక్షులు వరదరాజు, కమ్మసాలి నరసింహా, రాఘవేంద్ర, శివ, ఎంపిటీసీ మేకల వెంకటేష్, పాల్గొన్నారు.